క్లుప్తంగా

ద్విచక్ర వాహనాల తనిఖీ



ద్విచక్ర వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గం పోలీసులు ద్విచక్ర వాహనాలను సోమవారం తనిఖీ చేశారు. పట్టణంలోని స్థానిక అనంతపురం ప్రధాన రహదారిలో వాహనాలు తనిఖీ చేశారు. హెల్మెట్, రికార్డులు లేని వాహనదారులకు అపరాధ రుసుం వసూలు చేశారు. ఏఎస్ఐలు నారాయణ రెడ్డి, కృష్ణతో పాటు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

రెండు వినతులు

గుమ్మఘట్ట: రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో రెండు వినతులు అందినట్లు తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. ఫ్యామిలీ మెంబర్ల సర్టిఫికెట్ల కోసం రెండు వినతులు అందినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామకృష్ణ, డీటీ రఘు, తదితరులు పాల్గొన్నారు.

శుభకార్యం



నూతన వధూవరులతో మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర రెడ్డి

కూడేరు: మండలంలోని కొర్రకోడులో వైఎస్సార్ సీపీ నేత బీపీ మనోజ్ సోదరుడు బీపీ మధు వివాహ రిసెప్షన్ సోమవారం జరిగింది. కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వర రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. సర్పంచ్ చంద్రశేఖర్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి, నేతలు సీపీ వీరన్న, వడ్డే గంగాధర్, రాజశేఖర్, లాలెప్ప, గంగాధర్, వెంకటేష్, నిజాం, ప్రభాకర్ పాల్గొన్నారు.

ఉరవకొండ రూరల్ సీఐకి సన్మానం



సీఐ గౌస్‌ను సన్మానిస్తున్న దృశ్యం

ఉరవకొండ: స్థానిక అయ్యప్పస్వామి ఆలయంలో రూరల్ సీఐ సయ్యద్ చిన్నగౌస్‌ను అన్నదాన సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం సన్మానించారు. అయ్యప్పస్వామి ఆలయంలో పడి పూజ నిర్వహించి మాలధారులతో కలిసి భజన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం తన సొంత ఖర్చులతో అయ్యప్ప మాలధారులకు భిక్ష ఏర్పాటు చేయించారు. అయ్యప్ప అన్నదాన సేవా సమితి ఆధ్వర్యంలో సీఐను ఘనంగా సన్మానించారు.

శ్రీనివాస రామానుజన్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి




బెళుగుప్పలో నిర్వహించిన గణిత దినోత్సవంలో మాట్లాడుతున్న ఎస్ఐ శివ

బెళుగుప్ప: విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుంచే గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలని ఎస్ఐ శివ పేర్కొన్నారు. సోమవారం ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో గణిత దినోత్సవాన్ని నిర్వహించారు. ఎస్ఐ శివ పాల్గొని ఉపాధ్యాయులతో కలిసి రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. సన్‌రైజ్ పాఠశాలలోనూ కరస్పాండెంట్ మారెన్న ఆధ్వర్యంలో గణిత దినోత్సవం నిర్వహించారు.

రైతు దినోత్సవం

కుందుర్పి: స్థానిక సమాజ క్రాంతి, ఎస్కే చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నడుస్తున్న విలువల బడుల్లో సోమవారం రైతు దినోత్సవాన్ని జరుపుకున్నారు. కార్యక్రమంలో చారిటబుల్ ట్రస్టు సభ్యులు, కుందుర్పి రైతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గవిమఠం ఇన్‌చార్జ్ మేనేజర్‌గా రాణి బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరించిన రాణి

ఉరవకొండ: ఉరవకొండ గవిమఠం ఇన్‌చార్జ్ మేనేజర్‌గా కె.రాణి సోమవారం బాధ్యతలు చేపట్టారు. విజయవాడ దేవదాయ కమిషనర్ ఆదేశాల మేరకు ఇన్‌చార్జ్ మేనేజర్‌గా బాధ్యతలు చేపట్టారు. మేనేజర్‌కు గవిమఠం సిబ్బంది స్వాగతం పలికారు. అనంతరం మేనేజర్ గవిమఠం ఉత్తరాధికారి డాక్టర్ కరిబసవరాజేంద్రస్వామి ఆశీస్సులు పొందారు.

ఆశలు రాలిపాయె!



బెళుగుప్ప వద్ద కందిలో చీడపీడల నివారణకు మందు పిచికారీ చేస్తున్న రైతు

కంది పంట దిగుబడులపై రైతులకు బెంగ

- వరుస తుపాన్ల ప్రభావంతో కుదేలు
- పెట్టుబడి దక్కదంటున్న రైతులు
- పంట నష్ట పరిహారం, బీమాతో ఆదుకోవాలంటున్న అన్నదాతలు

బెళుగుప్ప: వేరుశనగ, ఇతర పంటలు సాగు చేసి, ఏటా నష్టాలు చవిచూస్తున్న రైతులు.. ఈ ఏడాది ఖరీఫ్‌లో అధిక విస్తీర్ణంలో కంది పంట సాగు చేశారు. అయితే కంది ఏపుగా పెరిగినా, ఆశించిన స్థాయిలో దిగుబడి వస్తుందనుకున్న సమయంలో వరుస తుఫాన్ల ప్రభావం పడింది. మబ్బులకు పూత, పిందె రాలిపోయింది. దీనికితోడు చీడ పీడలు దెబ్బతీశాయి. చేతికందివస్తుందనుకున్న సమయంలో ఇలా నష్టాలు పాలయ్యామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉరవకొండ నియోజకవర్గంలోని బెళుగుప్ప, ఉరవకొండ, కూడేరు, విడపనకల్లు, వజ్రకరూరు మండలాల్లో సుమారు 75 వేల ఎకరాల్లో ఖరీఫ్‌లో కంది పంట సాగు చేసినట్లు అధికారులు చెప్తున్నారు. రాయదుర్గం, కళ్యాణదుర్గం నియోజకవర్గాల్లోనూ ఖరీఫ్‌లో ఈసారి ప్రత్యామ్నాయ పంటగా సాగు చేశారు. గతేడాది వరకు ఆముదం, ఉలవ, కంది, పెసర పంటలు సాగు చేశారు. ప్రత్యామ్నాయ పంట దిగుబడి అంతంతమాత్రంగానే ఉండడంతోపాటు మార్కెట్‌లో ధరలు ఒడిదుడుకులతో గిట్టుబాటు కాలేదని రైతులు కంది పంట సాగుపై దృష్టి సారించారు. ఎకరం కంది పంట సాగుకు రూ.15 వేలకు పైగా పెట్టుబడులు పెట్టారు. మార్కెట్‌లో కంది క్వింటా ధర రూ.8 వేలు, సీజన్‌ను బట్టి రూ.9 వేలకు పైగా ఉండటంతో ఎక్కువ విస్తీర్ణంలో రైతులు కంది సాగు చేశారు.

కుదేలైన కంది రైతులు..

ఈయేడాది వర్షాధారంతోపాటు నీటి వసతి ఉన్న రైతులు కంది పంట సాగు చేశారు. అడపాదడపా వర్షాలకు ఏపుగా పెరిగిన కంది.. ఈనెల మొదటి వారంలో కురిసిన వర్షాలకు తోడు వాతావరణ పరిస్థితుల్లో మార్పుతో పూత, పిందె, కాయ రాలిపోయాయి. చీడపీడల నివారణకు మందులు ఎక్కువగా పిచికారీ చేయాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

క్షేత్రస్థాయి పరిశీలన లేదు..

వ్యవసాయధికారులు రైతులకు ఎప్పటకప్పుడు సలహాలు, సూచనలు ఇవ్వడంలో అధికారులు అలసత్వం వహిస్తున్నారు. ఖరీఫ్, రబీ సీజన్ల వారీగా క్షేత్రస్థాయి పర్యటనలు చేపట్టి, పంటల సాగులో విత్తనాల ఎంపిక, విత్తనశుద్ధి, ఎరువుల ఎంపిక మోతాదు, పూత, పిందె సమయంలో చేపట్టాల్సిన చీడపీడల నివారణ, సస్య రక్షణ చర్యలను ఎప్పటికప్పుడు తెలియజేయాలి. అయితే అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టలేదని రైతులు వాపోతున్నారు.

పెట్టుబడి అధికం



నేను నాలుగు ఎకరాల్లో కంది సాగు చేశా. గతేడాది పురుగు మందులు పిచికారీ మూడు, నాలుగుసార్లు చేస్తే పంట చేతికందివచ్చేది. ప్రస్తుతం కాయ దశ వరకే ఆరు పర్యాయాలు రసాయన మందులను పిచికారీ చేయాల్సి వచ్చింది. వాతావరణంలో ప్రతికూల పరిస్థితి వల్ల పంట దెబ్బ తినింది. పంట దిగుబడి వచ్చే పరిస్థితిలేదు.
– రైతు సురేష్, బెళుగుప్ప

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడి



కంది రైతులు ఎప్పటికప్పుడు సస్యరక్షణ చర్యలు చేపడితే ఆశించిన దిగుబడి వస్తుంది. ఇప్పటికే గ్రామాల్లో కంది పంట పరిశీలించాం. రైతులకు సలహాలు సూచనలను ఇచ్చాం. పూత పింజలు రాలిపోకుండా పది లీటర్ల నీటికి 15 గ్రాముల చొప్పున బోరాన్, కాల్షియం నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించాం. పూతలో పురుగు నివారణకు ఎకరానికి 200 ఎంఎల్ క్లోరిపైరిపాస్‌తో పాటు 500 ఎంఎల్ వేపనూనె కలిపి పిచికారీ చేసుకోవాలి. – పృథ్వీసాగర్, ఏఓ, బెళుగుప్ప

రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో కంది పంట సాగు విస్తీర్ణం ఇలా..

నియోజకవర్గం	కంది సాగు విస్తీర్ణం ఎకరాల్లో..
ఉరవకొండ	75,000
రాయదుర్గం	24,500
కళ్యాణదుర్గం	49,100



ఆవులెన్న సమీపంలో ఏపుగా పెరిగినా కాయలు లేని కంది

పార్టీ బలోపేతానికి కలసికట్టుగా పనిచేద్దాం



పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత, సమన్వయకర్త రంగయ్యను సన్మానిస్తున్న దృశ్యం



అనంతకు పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలుపుతున్న డాక్టర్ బొమ్మయ్య

కంబదూరు: పార్టీ బలోపేతానికి కలసికట్టుగా పనిచేద్దామని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి సూచించారు. వైఎస్సార్‌సీపీ డాక్టర్స్ విభాగం జిల్లా అధ్యక్షుడు బొమ్మయ్య కళ్యాణదుర్గం నాయకులతో కలిసి అనంతపురంలోని అనంత, మాజీ ఎంపీ, కళ్యాణదుర్గం సమన్వయకర్తను మర్యాదపూర్వకంగా కలిశారు.

పార్టీ బలోపేతానికి శక్తివంచనలేకుండా పనిచేస్తా

ఉరవకొండ: పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా పనిచేస్తానని నెరిమెట్ల గ్రామ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు యోగేంద్రరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడిగా అవకాశం కల్పించినందుకు పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, ఉరవకొండ సమన్వయకర్త వై. విశ్వేశ్వరరెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు.



జిల్లా పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు యోగేంద్రరెడ్డి

అనంత, రంగయ్యకు సన్మానం

కళ్యాణదుర్గం రూరల్: వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, కళ్యాణదుర్గం సమన్వయకర్త తలారి రంగయ్యను పార్టీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు కురుబ రేవణ్ణ సోమవారం సన్మానించారు. తనపై నమ్మకం ఉంచి వాణిజ్య విభాగం అధ్యక్షుడిగా అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో పరంధామరెడ్డి, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా కనకదాస విగ్రహావిష్కరణ

బ్రహ్మసముద్రం: మండలంలోని వేపులపర్తిలోని కురుబల ఆరాధ్య దైవం భక్త కనకదాస విగ్రహావిష్కరణ సోమవారం నిర్వహించారు. కురుబల కుల బాంధవులు కనక గురుపీఠం పీఠాధిపతి ఈశ్వరానందపురి స్వామి హాజరయ్యారు. కన్యమణులు , మహిళల జ్యోతులు, కలశాలతో గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం గ్రామ కురుబ కమిటీ ఆధ్వర్యంలో కనకదాస విగ్రహాన్ని ఆవిష్కరించారు.

దళితులపై దౌర్జన్యం సరికాదు



ఆర్డీఓ వసంతబాబుతో చర్చిస్తున్న నాయకులు

కళ్యాణదుర్గం: నియోజకవర్గంలో దళితులపై దౌర్జన్యం సరికాదని ఎస్సీ, ఎస్టీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి అన్నారు. సోమవారం ఆర్డీఓ కార్యాలయం వద్ద బాధితురాలు దివ్య, ఎస్సీ, ఎస్టీ జేఏసీ నాయకులతో కలిసి ధర్నా చేశారు. పట్టణంలోని ఆర్డీఓ ఆసుపత్రి ఎదురుగా సర్వే నంబర్ 357 రోడ్డు పోరంబోకు స్థలంలో 20 ఏళ్లుగా చిన్న హోటల్ పెట్టుకుని దివ్య అనే మహిళ జీవనం సాగిస్తుందన్నారు. హోటల్‌కు వెనుక వైపు 359 సర్వే నంబర్‌లో గొల్ల నరసింహులు అనే కానిస్టేబుల్ ఇంటిని నిర్మించుకున్నారన్నారు. తన ఇంటి ముందు ఉన్న హోటల్‌ను తొలగించాలని కానిస్టేబుల్ దివ్యను భయభ్రాంతులకు గురి చేస్తున్నట్లు తెలిపారు. రాజకీయ పలుకుబడితో మున్సిపల్ కమిషనర్‌తో కలిసి హోటల్‌ను తొలగించాలని నోటీసులు ఇవ్వడం సమంజసం కాదన్నారు. ఆర్డీఓ వసంతబాబు మాట్లాడుతూ తహసీల్దార్, మున్సిపల్, ఆర్అండ్‌బీ అధికారులతో చర్చించి, బాధితురాలికి న్యాయం చేస్తామన్నారు. ఎస్సీ,ఎస్టీ జేఏసీ తాలూకా ఇన్‌చార్జ్ చెలిమప్ప, జిల్లా నాయకులు దొణతిమ్మప్ప, నారాయణ, రామచంద్ర, ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీకే కుళ్ళాయప్ప, రాజు పాల్గొన్నారు.

వినతుల స్వీకరణ : స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆర్డీఓ వసంతబాబు, తహసీల్దార్ భాస్కర్ ప్రజల సమస్యలపై అర్జీలను స్వీకరించారు.

రైతుల రుణం తీర్చుకోలేనిది



ఆదర్శ రైతులకు పాదపూజ చేస్తున్న జైకిసాన్ ఫౌండేషన్ సభ్యులు

ఉరవకొండ: ఆకలి తీర్చేవాడు దేవుడైతే ధాన్యాన్ని పండిచేవాడు దేవుళ్లకే దేవుడని, రైతుల రుణం తీర్చుకోలేనిదని పలువురు వక్తలు అన్నారు. సోమవారం ఉరవకొండ జైకిసాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాతీయ రైతు దినోత్సవం నిర్వహించారు. రైతు దినోత్సవ వేడుకలకు గోరంట్లకు చెందిన బెస్ట్ యూనివర్శిటీ డీన్ రామ్‌గోపాల్, పుట్టపర్తికి చెందిన ప్రముఖ పర్యావరణ వేత్త భాస్కర్‌నాయుడు, అనంతపురం ఏడీ రవి, కళ్యాణదుర్గం ఏడీ ఎల్లప్ప, రాయదుర్గం ఏడీ లక్ష్మానాయక్, ఉరవకొండ ఏఓ శుభకర్, బొమ్మనహాళ్ ఏఓ సాయి, పామిడి ఏఓ లీలా వసంధర, మడకశిర ఏఓ తిమ్మప్ప, ముదిగుబ్బ ఏఓ నరసింహులు, గార్లదిన్న ఏఓ సోమశేఖర్, పెద్దపప్పూరు ఏఓ కళ్యాణితో పాటు జిల్లాలోని ప్రముఖ శాస్త్రవేత్తలు హాజరయ్యారు. ఈసందర్భంగా జైకిసాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు నాగమల్లి ఓబుళేసు ఆధ్వర్యంలో అనంతపురం బైపాస్ నుంచి రైతులు వారి కుటుంబ సభ్యులతో కలిసి ఉరగాద్రి కళ్యాణ మండపం వరకు అన్నదాతల ఆనంద ర్యాలీ నిర్వహించారు. అనంతరం కిమ్స్ సవేరా ఆసుపత్రి వారి సౌజన్యంతో రైతులు, వారి కుటుంబ సభ్యులకు ఉచిత కంటి, గుండె, దంత వైద్య శిబిరంతో పాటు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందించారు. అనంతరం ఆదర్శ రైతులకు పాదపూజ చేశారు. అనంతరం ఇటీవల పొలాల్లో విద్యుత్ షాక్ గురై మృతి చెందిన రైతులకు శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం ఉత్తమ వ్యవసాయ శాఖ ఏడీ, ఏఓలతో పాటు శాస్త్రవేత్తలను సత్కరించారు.

ప్రతిష్టను దిగజార్చేందుకు కుట్ర

- కురుబ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ గోవిందు



ఉరవకొండ: కేవలం ప్రతిష్టను దిగజార్చేందుకు టీడీపీ నాయకులు కుట్ర పన్నారని, విడపనకల్లు మండలం జనార్ధనపల్లికి చెందిన పాండురంగ స్వామి ఆలయ భూమి ఆక్రమణపై ఆరోపణలపై బహిరంగ చర్చకు సిద్ధం కావాలని ఉరవకొండ కురుబ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్, వైఎస్సార్‌సీపీ నేత లత్తవరం గోవింద్ సవాల్ విసిరారు. సోమవారం స్థానిక ఇంద్రానగర్‌లోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. ఆంధ్రజ్యోతి, ఈనాడు, ఈటీవీ తదితర మీడియాల్లో ఆలయ భూములను తాను, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి అనుచరులు కబ్జా చేశారని ప్రచారం చేయడం సరికాదన్నారు. సర్వే నం.141లోని 21.05 ఎకరాల భూమి ఉరవకొండ పాండురంగస్వామి ఆలయానికి చెందినది కాదన్నారు. సదురు ఈభూమిని రిజిస్ట్రేషన్ చేయించుకున్న సాయి, వెంకటేష్, భానుప్రకాష్ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర రెడ్డి అనుచరులు కాదన్నారు. వారికి వైఎస్సార్‌సీపీతో ఎలాంటి సంబంధం లేదన్నారు. 21.05 ఎకరాల భూమి తన ఆధీనంలో ఉన్నట్లు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. కేవలం ఉద్దేశపూర్వకంగా మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డితో పాటు పార్టీ ప్రతిష్టను దిగజార్చడానికి టీడీపీ నాయకులు కుట్ర పన్నుతున్నారన్నారు. దమ్ముంటే రాజకీయంగా ఎదుర్కోవాలేగానీ ఇలాంటి నిరాధార ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ఎల్లోమీడియా ద్వారా అసత్య ఆరోపణలు చేసి తమ ప్రతిష్టకు భంగం కలిగించిన జనార్ధనపల్లి టీడీపీ సర్పంచ్ జనార్ధననాయుడు, రామకృష్ణ, పాండురంగ, కావేటి చౌదరి, శ్రీనాథ్‌లపై పరువు నష్టదావా వేస్తున్నట్లు తెలిపారు.

బీటీ రామదాసు లేని లోటు తీర్చలేనిది



బీటీ రామదాసు మృతదేహానికి నివాళి అర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కుందుర్పి: బీటీ రామదాసు లేని లోటు తీర్చలేనిదని వైఎస్సార్‌సీపీ మండల నాయకులు అన్నారు. గుండె శస్త్రచికిత్స వికటించి బెస్తరపల్లి బీటీ రామదాసు ఆదివారం చెందాడు. జెడ్పీటీసీ రాధాస్వామి, ఎంపీపీ కమలమ్మ, మాజీ వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ పాలాక్షి, మండల కన్వీనర్ సత్యనారాయణశాస్త్రి, మాజీ సర్పంచ్ సుదర్శన్‌రెడ్డి తదితరులు బీటీ రామదాసు మృతదేహానికి సోమవారం నివాళులర్పించారు. వైస్ ఎంపీపీ భీమిరెడ్డి, మాజీ జెడ్పీటీసీలు ఈరన్న, రాజగోపాల్, ఎంపీటీసీలు ఓనాథ్, హనుమంతరాయుడు, సర్పంచులు మారుతేశ్వరీ, మమత, మర్చంట్ గోపాల్, బీటీ రాము, అంజి తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

నేత్ర పర్వంగా వెండిపల్లకీ ఉత్సవం



యల్లమ్మతల్లి

కుందుర్పి:నాగేపల్లిలో యల్లమ్మ వెండి పల్లకీ ఉత్సవం సోమవారం నిర్వహించారు. ఉదయం అమ్మవారికి కుంభాభిషేకం, కలశస్థాపన, సాయంత్రం వెండిపల్లకీలో అమ్మవారిని ప్రతిష్ఠించి గ్రామోత్సవం నిర్వహించారు. మంగళవారం అగ్నిహోమం, మధ్యాహ్నం 12 గంటలకు మడుగు రథోత్సవం, సాయంత్రం 4 గంటలకు రథోత్సవం నిర్వహిస్తారు.

పార్వతీ పరమేశ్వరులకు ప్రత్యేక పూజలు



పూజ చేస్తున్న అర్చకుడు

కూడేరు: ప్రఖ్యాతి గాంచిన పార్వతి పరమేశ్వర జోడు లింగాల సంగమేశ్వర ఆలయంలో అర్చకులు సోమవారం పూజలు చేశారు.

రేపు ధ్వజస్తంభ ప్రతిష్ట

బెళుగుప్ప: మండల కేంద్రంలోని విఘ్నేశ్వరస్వామి ఆలయం వద్ద బుధవారం కేరళ తాంత్రిక నిపుణులు బ్రహ్మశ్రీ శ్రీరంగం సరున్మోహన్ తంత్రి ఆధ్వర్యంలో ధ్వజస్తంభ మండల పూజ జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఉదయం మండల పూజలో భాగంగా మహాగణపతి హోమం, కలశపూజ, గణపతి కలశాభిషేకం, నవ కలశాభిషేకం, పంచగవ్యాభిషేకం, పరీక్షలకు సన్నద్ధం అవుతున్న విద్యార్థుల కోసం ప్రత్యేకంగా విద్యారాజగోపాల మంత్రార్చన పూజ, సాయంత్రం 5 నుంచి మహాపుష్పాభిషేకం, 6 గంటలకు లక్ష దీపార్చన నిర్వహించనున్నట్లు తెలిపారు.

నారాయణార్యారూఢ స్వామి ఆరాధన



విరుపాపల్లిలోని సద్గురు నారాయణార్యారూఢ స్వామి

బెళుగుప్ప: విరుపాపల్లిలో సద్గురు నారాయణార్యారూఢ స్వామి ఆరాధన బుధవారం జరుగుతుందని ట్రస్టు నిర్వాహకులు మఠాధ్యక్షుడు సూర్యానారాయణస్వామి తెలిపారు. రాత్రికి రథోత్సవం సందర్భంగా ఆలయంలో స్వామి మూలవిరాట్, మహిమాన్విత ఊయలకు గంగపూజ, పంచామృతాభిషేక పూజలు మర్నాడు మఠాధ్యక్షుడు జ్ఞానమూర్తిస్వామితో నిర్వహిస్తారు. బుధవారం రాత్రికి ఆలయ కమిటీకి చెందిన జిల్లా స్థాయి భజన పోటీలను నిర్వహిస్తున్నట్లు మఠం సభ్యులు తెలిపారు.

జరుట్ల రామలింగేశ్వరుడికి అభిషేకాలు



అలంకరణలో జరుట్ల రామలింగేశ్వరస్వామి

వజ్రకరూరు: జరుట్లరాంపురం రామలింగేశ్వర స్వామి ఆలయంలో సోమవారం అభిషేకాలు నిర్వహించారు. ఉదయం ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, రుద్రాభిషేకం, అర్చనలు, మహామంగళహారతి, తీర్థప్రసాద వినియోగం నిర్వహించారు. నగరేశ్వరస్వా మి, భోగేశ్వరస్వామి, రామేశ్వరస్వామి ఆలయాల్లోనూ పూజలు చేశారు.

భక్తిశ్రద్ధలతో ధనుర్మాస పూజలు



ధనుర్మాసపూజలందుకున్న వేంకటరమణుడు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ప్రముఖ ఆలయాల్లో ధనుర్మాస పూజలు భక్తిశ్రద్ధలతో జరుగుతున్నాయి. కోటలో వెలసిన శ్రీప్రసన్న వేంకటరమణస్వామి ఆలయంలో సోమవారం తెల్లవారు జామున 5 గంటల నుంచి ధనుర్మాస పూజలు జరిగాయి. స్వామికి పంచామృతాభిషేకం, అభిషేకాలు, కుంకుమార్చన, నైవేద్యం, తిరుప్పావై సేవ, పుష్పార్చన, ప్రసాద వినియోగ కార్యక్రమాలు జరిగాయి.

అబాకస్ పోటీల్లో నితిన్ సత్తా



నితిన్‌ను అభినందిస్తున్న కరస్పాండెంట్ శ్రీనివాసులు, హెచ్‌ఎం సుమ

బెళుగుప్ప: జిల్లా కేంద్రంలో అబాకస్ అండ్ వేదిక్ మ్యాచ్ ప్రతిభా పోటీల్లో శ్రీనివాస విద్యానికేతన్ విద్యార్థి నితిన్ ప్రతిభ కనబరిచినట్లు కరస్పాండెంట్ శ్రీనివాసులు, హెచ్‌ఎం సుమ సోమవారం తెలి పారు. విద్యార్థి నితిన్‌ను కరస్పాండెంట్, ఉపాధ్యాయులు అభినందించారు.

సంక్షిప్త సమాచారం

కళాశాలకు సొంత భవనం నిర్మించాలి

రాయదుర్గంటౌన్: డి.హీరేహాళ్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు సొంత భవనం ఏర్పాటు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి పి.ఆంజనేయులు, నియోజకవర్గ అధ్యక్షుడు శశికుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం విలేకరులతో మాట్లాడారు. కళాశాల అభివృద్ధిని ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. తాగునీరు, గదుల కొరతతో ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. రెగ్యులర్ అధ్యాపకులు లేక విద్యార్థుల విద్యాభ్యాసం ప్రశ్నార్థకంగా మారుతోందన్నారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు అభిషేక్, రాజు, పవన్ పాల్గొన్నారు.

హెచ్‌ఎం తీరుపై డీవైఈఓ విచారణ

వజ్రకరూరు: మండలంలోని చాబాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగేంద్ర తీరుపై డీవైఈఓ శ్రీదేవి విచారణ చేపట్టారు. పాఠశాలలో వాచ్‌మెన్ నియామకంపై వివరాలు అడిగినందుకు హెచ్‌ఎం తనపట్ల దురుసుగా ప్రవర్తించారని గ్రామానికి చెందిన కేదార్‌నాథ్ అనే వ్యక్తి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. దీంతో డీవైఈఓ సోమవారం చాబాల జెడ్పీహెచ్ఎస్‌లో విచారణ చేపట్టారు. ఎంఈఓ ఎర్రిస్వామి పాల్గొన్నారు.

బ్యాడిగి మిర్చి రైతులను ఆదుకోవాలి

కూడేరు: ముద్దలాపురంతో పాటు మరికొన్ని గ్రామాల్లో దెబ్బతిన్న బ్యాడిగి మిర్చి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ, దండోరా, వీహెచ్‌పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం వారు మాట్లాడుతూ మండలంలో వందలాది ఎకరాల్లో బ్యాడిగి మిర్చి పంట తెగుళ్లు, తుఫాను ప్రభావంతో పూర్తిగా దెబ్బతినిందన్నారు. రీసర్వే డీటీ ప్రసాద్‌కు వినతిపత్రం అందించా రు. నాయకులు రమణ, పెద్దన్న, పాల ఈశ్వరయ్య, మహేష్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

మరుట్లలో ఉచిత గర్భకోశ చికిత్స శిబిరం



గర్భకోశ వ్యాధి పరీక్షలు నిర్వహిస్తున్న డిప్యూటీ డైరెక్టర్ సుధాకర్

కూడేరు: మరుట్లలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గర్భకోశ చికిత్స శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. పశువులకు డిప్యూటీ డైరెక్టర్ గర్భ కోశ చికిత్స పరీక్షలు చేశారు. పశువైద్యాధికారి సుధాకర్ మాట్లాడుతూ గర్భకోశ వ్యాధులతో బాధపడుతున్న పశువుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రతలు తెలియజేశారు. పశు వైద్యాధికారి శ్రీనివాసు లు, ఏహెచ్‌ఏలు రాఘవ, దామోదర్, భవాని, య శోద, జీఎంఎస్‌లు అశ్వర్థ, రామాంజనేయులు పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

కళ్యాణదుర్గం: స్థానిక గోల్డెన్ బెల్స్ ప్రైవేట్ పాఠశాలలో సోమవారం క్రిస్మస్ వేడుకలు జరిగాయి. పాఠశాల ప్రిన్సిపాల్ పాదర్ జీన్స్ జేవియర్ వేడుకలను ప్రారంభించారు. విద్యార్థులు క్రీస్తు పుట్టుక, జీవన విధానంపై సాంస్కృతిక నాటికలతో అలరించారు. పాఠశాల ఏఓ పాదర్ మోరిస్, పాఠశాలల కరస్పాండెంట్లు రమేష్‌బాబు, కొత్తపల్లి బా బు, శివలింగారెడ్డి, రాము, దొణతిమ్మ, రామకృష్ణ, గాజుల హనుమంతయ్య, మారుతి పాల్గొన్నారు.

ఇళ్ల బిల్లులు మంజూరు చేయండి

శెట్టూరు: పేదలు నిర్మించుకున్న ఇళ్లకు బిల్లులు మంజూరు చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు తహసీల్దార్ ఈశ్వరయ్యశెట్టికి వినతిపత్రం ఇచ్చారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతి పత్రం ఇచ్చారు. ఎమ్మార్పీఎస్ నాయకులు శివన్న, రామన్న, తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్లు అందుబాటులో ఉండాలి

బొమ్మనహాళ్: డీలర్లు ప్రజలకు అందుబాటులో ఉండి రేషన్‌ను సక్రమంగా అందించాలని తహసీల్దార్ మునివేలు తెలిపారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో డీలర్లు , ఎండీయూ వాహనదారులతో సమావేశం నిర్వహించా రు. తహసీల్దార్ మునివేలు మాట్లాడుతూ ప్రతి నెలా 1 నుంచి 18 వరకు ఎండీయూ వాహన నిర్వా హకు లు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. కంది పప్పు కేజీ రూ.67, చక్కెర అరకిలో రూ. 17తో విక్రయించాలని తెలిపారు. ఈఓపీఆర్డీ దాస్, ఆర్ఐ బాలకృష్ణ, డీలర్ల సంఘం అధ్యక్షుడు పయ్యావుల మోహన్ పాల్గొన్నారు.